సాక్షి చిత్తూరు
బుధవారం ၊ 5 ၊ జూలై ၊ 2023



లక్ష్మీకటాక్షం
హిందూ ధర్మంలోని సంప్రదాయాలను పాటిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుందని ఆచార్యులు రామకృష్ణ సోమయాజి తెలిపారు. - 8లో



మాదకద్రవ్యాల నివారణే లక్ష్యం
అన్ని విభాగాలు మాదకద్రవ్యాలను అరికట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	32	26
తిరుపతి	32	26
తిరుమల	27	22
గూడూరు	33	28
నగరి	33	26

న్యూస్‌రీల్

స్తంభించిన రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో మంగళవారం రిజిస్ట్రేషన్‌శాఖ సర్వర్ సక్రమంగా పనిచేయక పోవడంతో రిజిస్ట్రేషన్లు స్తంభించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నెట్ రాక పోవడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. తర్వాత సర్వర్ కనెక్ట్ కావడంతో కొన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయి. చిత్తూరు అర్బన్, రూరల్ కార్యాలయాల్లో కేవలం 10 డ్యాకుమెంటేషన్లు మాత్రమే పూర్తయ్యాయి.

9న ఒబెరాయ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్‌కు శంకుస్థాపన

- వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

తిరుపతి అర్బన్: తిరుపతి సమీపంలోని పేరూర్ వద్ద ఒబెరాయ్ గ్రూపు ఆఫ్ హోటల్స్‌కు సంబంధించి ఈనెల 9వ తేదీన కడప జిల్లా, గండికోట నుంచి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆ మేరకు జర్మన్ షెడ్ల తోపాటు సరైన ఏర్పాట్లు చేపట్టాలని పర్యాటకశాఖ అధికారులు రమణప్రసాద్, గిరిధర్‌రెడ్డి, రుపేంద్రనాథ్‌రెడ్డిని ఆదేశించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ లైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 66,077 మంది స్వామివారిని దర్శించుకోగా.. 29,193 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.30 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.


డిజిటల్ క్లాసులతో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

నారాయణవనం: తరగతి గదిలో డిజిటల్ పాఠాలతో నాణ్యమైన విద్య అందించే సౌలభ్యం కలిగిందని జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ తెలిపారు. డిజిటల్ విధానంలో బోధన, బైజ్యూస్‌పై సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం మంగళవారం సాయంత్రం ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మొదటి బ్యాచ్‌లో నారాయణవరం, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల నుంచి 153 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సక్రమంగా ఉపయోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆన్‌లైన్ డిజిటల్ క్లాస్‌తో అప్‌డేటడ్ సమాచారంతో బోధన సాగించే అవకాశం ఉందన్నారు. పుత్తూరు డిప్యూటీ డీఈఓ రఘురామయ్య, నారాయణవనం ఎంఈఓ ప్రకాకర్‌రాజు, డైట్ అధ్యాపకులు చెంగల్‌రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్గో ఏజెంట్లకు కమీషన్ పెంపు



సురేంద్రబాబు, కార్గో జిల్లా ఇన్‌చార్జి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ కార్గో ఏజెంట్లకు కమీషన్ పెంచారని జిల్లా ఇన్‌చార్జి సురేంద్రబాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 11 ఆర్టీసీ డిపోల ద్వారా నెలకు రూ.75 లక్షలు రాబడి వస్తోందని, చెన్నై కార్గో ద్వారా రూ.25 లక్షలు సమకూరుతోందని తెలిపారు. మూడు డీజీటీల తోపాటు 11 ఆర్టీసీ డిపోల్లోనూ కార్గో సెంటర్ల నుంచి ఆర్టీసీ కార్గో వ్యాపారాలు సాగుతున్నాయన్నారు. గతంలో 5 శాతం కమీషన్ ఉండేదని, తాజాగా 15 శాతానికి కమీషన్ చేరిందన్నారు. చెన్నైలో ఏజెంట్లుగా చేరడానికి రూ.5వేలు, తిరుపతిలో రూ.2,500, మండల కేంద్రాలో రూ.1000 డిపాజిట్ చేస్తే సరిపోతుందన్నారు. ఈనెల 15వ తేదీన తిరుపతి బస్టాండ్‌లోని కార్గో సెంటర్ నిర్వహించడానికి టెండర్లు ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు.

ఉప్పొంగిన అభిమానం



చిత్తూరు రూరల్: నగరంలోని అమూల్ డెయిరీ భూమి పూజకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని చూసేందుకు ఓ దివ్యాంగుడు తరలివచ్చాడు. జై జగనన్న అనే ప్లకార్డును చేత పట్టుకుని తన అభిమానాన్ని చాటుకున్నాడు.

వరాల వెల్లువ

- చిత్తూరులో రోడ్ల అభివృద్ధికి నిధులు
- నగరంలోని సచివాలయాలకు అదనంగా రూ.50 లక్షల చొప్పున మంజూరు
- షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు వేతన బకాయిల విడుదల
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు భరోసా
- కాపు భవన్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- జిల్లాను ప్రగతిపథంలో నడిపిస్తామని స్పష్టం చేసిన సీఎం వైఎస్ జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లాపై వరాల జల్లు కురిపించారు. ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారు. పాడి రైతుల జీవనోపాధికి పునరుజ్జీవం పోశారు. యువతకు ఉద్యోగావకాశాలందించేందుకు కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ప్రణాళికాబద్ధంగా విద్యాసంస్థల స్థాపనకు హామీ ఇచ్చారు. షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల ఇళ్లలో దీపాలు వెలిగించారు. పారిశ్రామిక పురోగతికి భరోసా కల్పించారు.





సీఎం సభకు హాజరైన అశేష జనసందోహం (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, చిత్తూరు : హెరిటేజ్ డెయిరీ కోసం చంద్రబాబునాయుడు కుట్రపూరితంగా విజయా డెయిరీని మూయించారని, 14 ఏళ్ల సీఎంగా పనిచేసినా సొంత జిల్లాకు ఒక్క మేలు చేయలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన ముందుగా చిత్తూరులో అమూల్ డెయిరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం చిత్తూరు డెయిరీని తెరిపిస్తున్నామన్నారు. రూ.182కోట్ల బకాయిలు చెల్లించి, దేశంలోనే మూడో అతిపెద్ద సహకార సంస్థ అమూల్ ద్వారా రూ.385 కోట్ల పెట్టుబడులతో డెయిరీని తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. ఈ క్రమంలోనే పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి అమూల్ సంస్థ చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ప్రతి ఆరునెలలకు ఒకసారి లాభాల్లో రైతులకు బోనస్‌లు అందిస్తుందని వివరించారు. ఒప్పందం ప్రకారం అమూల్ సంస్థ తొలి దశలో రూ.150 కోట్లతో పనులు ప్రారంభిస్తుందని, 10 నెలల్లోనే లక్ష లీటర్ల ప్రాసెసింగ్ మొదలుపెట్టేలా కార్యాచరణ అమలు చేస్తుందన్నారు. ఈ డెయిరీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 5వేల మందికి ప్రత్యక్షంగా, 2లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ప్రకటించారు. దశలవారీగా ఇక్కడే పాల పొడి తయారీ, యూహెచ్‌టీ పాల విభాగం, చీజ్, పన్నీరు, స్వీట్లు కూడా తయారు చేసే పరిస్థితి వస్తుందని, తర్వాత దశలో ఏకంగా 10 లక్షల లీటర్లు ప్రాసెస్ స్థాయికి చేరుతుందని స్పష్టం చేశారు.

కార్మికులకు రూ.32 కోట్లు

చిత్తూరు నగరంలోని చక్కెర కర్మాగారానికి సంబంధించి కార్మికుల వేతన బకాయిల కింద రూ.32 కోట్లు చెల్లించినట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. చిత్తూరుకు రాకముందే కార్మికుల ముఖాల్లో చిరునవ్వు చూసేందుకు వారి ఖాతాల్లో నగదు జమ చేసినట్లు వివరించారు. అలాగే నగరంలో ఫుడ్ ప్రాసెస్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రెండు మూడు నెలల్లోనే ఈ యూనిట్ కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విన్నపం మేరకు పలు హామీలను అందించారు. చిత్తూరులో 37 కిలోమీటర్ల మేరకు రహదారుల విస్తరణకు పచ్చజెండా ఊపారు. కార్పొరేషన్ పరిధిలో రూ.75కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని భరోసా ఇచ్చారు. కలెక్టర్ ప్రతిపాదనల మేరకు నూతన విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని సచివాలయాలకు రూ.50లక్షల చొప్పున అదనపు నిధులను తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నగరంలో బీసీ భవన్ నిర్మాణం దాదాపు పూర్తికావస్తోందని, త్వరలోనే కాపు భవన్ నిర్మించనున్నట్లు వెల్లడించారు.



జై జగన్ అంటూ నినదిస్తున్న అభిమానులు



వేదికపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి, రోజా, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, అధికారులు



300 పడకల ఆస్పత్రికి భూమి పూజ అనంతరం సీఎంసీ వైద్యులు, సిబ్బందితో ముఖ్యమంత్రి



అమూల్ డెయిరీ నమూనాను పరిశీలిస్తూ..



ఆటోగ్రాఫ్.. స్వీట్ మెమోరీస్

దశాబ్దాల కల సాకారం





సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి , కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావాసుల దశాబ్దాల కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. అమూల్ డెయిరీ స్థాపనతో లక్షలాదిమందికి ఉపాధి కల్పించవచ్చనే సదుద్దేశంతోనే మహోన్నత ఘట్టానికి తెరతీశారన్నారు.

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన అమ్మఒడి కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌నమోహన్‌రెడ్డి చిత్తూరులోనే శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అమూల్ డెయిరీకి సీఎం చేతులమీదుగా శంకుస్థాపన జరగడం ఆనందంగా ఉందని తెలిపారు. చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలను తీర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. అప్పట్లో సీఎంసీకి 600 ఎకరాలను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కేటాయిస్తే, ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 300 పడకల ఆస్పత్రికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందని వెల్లడించారు.



జగన్ మామయ్య కోసం బారులు తీరిన విద్యార్థినులు



ప్రజలతో మమేకమవుతూ సెల్ఫీ..

దోపిడీకి కళ్లెం



అమూల్ సంస్థ యూనిట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ప్రైవేటు డెయిరీల దోపిడీకి కళ్లెం పడుతుంది. భవిష్యత్తులో పాడి రైతులకు మంచి గిట్టుబాటు ధర దక్కుతుంది. ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.
– జ్ఞానశేఖర్, పాడి రైతు , తూగుండ్రం గ్రామం

చరిత్రలో నిలిచిపోతారు



రెండు దశాబ్దాలుగా మూతపడిన చిత్తూరు విజయా డెయిరీని పునరుద్ధరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాడి రైతుల గుండెల్లో, చరిత్రలో నిలిచిపోతారు. అమూల్ సంస్థ జగనన్న పాలవెల్లువ కింద పాలసేకరణ చేపట్టడంతో గిట్టుబాటు ధర దక్కుతోంది. పాడి ఆవుల పెంపకంతో జీవనోపాధి పొందగలమనే ధైర్యం వచ్చింది – పత్తాయరం, పాడిరైతు, ఎస్‌ఆర్‌పురం

వెలుగులు నింపారు



ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను చెల్లించి మా బతుకుల్లో వెలుగులు నింపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ. 32 కోట్ల బకాయిలను చెల్లించి ఆదుకున్నారు. ముఖ్యమంత్రి రుణం తీర్చుకోలేం.
– కేశవరెడ్డి, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం నేత

దేవుడిచ్చిన వరం



మాలాంటి నిరుపేద కార్మికులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేవుడిచ్చిన వరం. కార్మికుల కష్టాలను అడిగి తెలుసుకుని సహాయం చేసే గొప్పవ్యక్తి. పెండింగ్ బకాయిలు చెల్లించడంతో మా కుటుంబాలు జీవితాంతం ఆయన పేరు చెప్పుకుంటాం.
– భాస్కర్, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికుడు

జిల్లా కేంద్రం.. జనసంద్రం

సాక్షి, చిత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం చిత్తూరులో నిర్వహించిన బహిరంగ సభకు అనూహ్య స్పందన లభించింది. నగర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జనవాహిని సభకు పోటెత్తింది. సుమారు 50 నిమిషాల పాటు మాట్లాడిన ముఖ్యమంత్రి జగన్ తన ప్రసంగంలో ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కలసికట్టుగా రాష్ట్రానికి చేస్తున్న ద్రోహాన్ని ఎండగట్టారు. చంద్రబాబు సొంత జిల్లా పాడి రైతులను నిలువునా ముంచేశారని చెప్పినప్పుడు ప్రజలంతా అవునని ముక్తకంఠంతో నినదించారు. ''చంద్రబాబు ద్రోహి.. బైబై బాబూ..'' అంటూ ఎలుగెత్తారు. ప్లకార్డులు ప్రదర్శించారు. 'చిత్తూరు డెయిరీని తెరిపిస్తానని ప్రజా సంకల్పయాత్రలో చెప్పా. మాట ప్రకారం రూ.182 కోట్ల అప్పులు చెల్లించి ఇవాళ తలుపులు తెరిపిస్తున్నాం..' అని సీఎం జగన్ పేర్కొనడంతో కరతాళ ధ్వనులు మారుమోగాయి.

రోడ్ షోలో పూలవర్షం

సీఎం జగన్ రోడ్ షో సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా వేలాదిమంది నిలుచుని జేజేలు పలికారు. అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు వేలాదిమంది ఆనందోత్సాహాలతో సెల్‌ఫోన్లలో రోడ్ షోను చిత్రీకరించడం కనిపించింది. అత్యధికంగా మహిళలు, యువత పాల్గొనడం విశేషం. భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, స్వాగత తోరణాలతో సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. సీఎం ప్రయాణించిన బస్సు వెంట పలువురు పరుగులు తీయడం కనిపించింది.

ఉదయం 10.25 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో చిత్తూరులోని మెసానిక్ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎం జగన్ ప్రత్యేక బస్సులో రోడ్‌షోగా చిత్తూరు డెయిరీ వద్దకు చేరుకున్నారు. ఉదయం 11.07 గంటలకు శుభ ముహూర్తంలో చిత్తూరు డెయిరీకి భూమిపూజ చేశారు. 11.45 గంటలకు బహిరంగ సభలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 1.15 గంటల ప్రాంతంలో సీఎంసీ ఆస్పత్రి ఆవరణలో 300 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం 3.30 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు.





మీ రాకకోసం... చిత్తూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు ఎదురుచూస్తున్న జనం

క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైద్యశాఖ సిబ్బంది

పెద్దపంజాణి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 2001 నుంచి 2008 మధ్యలో డిస్ట్రిక్ సెలెక్షన్ కమిటీ ద్వారా సెలెక్టయి ఐదేళ్ల కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసిన వైద్యశాఖకు చెందిన పలువురిని రెగ్యులరైజ్ చేసేందుకు సీఎం జీఓ విడుదల చేయడంతో కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 150మంది ఉద్యోగులు మూడు కేటగిరిల్లో ఉన్నారని, వీరిలో ల్యాబ్ టెక్నీషియన్లు, సెకండ్ ఏఎన్‌ఎంలు, ఫార్మసిస్టులు ఉన్నారని,.తమ జీవితాల్లో వెలుగులు నింపిన సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటామని ల్యాబ్ టెక్నీషియన్ విజయలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణే లక్ష్యం

తిరుపతి అర్బన్: అన్ని విభాగాలు సమన్వయంతో మాదకద్రవ్యాలను అరికట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అమరావతి నుంచి మాదకద్రవ్యాలను అరికట్టడానికి తీసుకోవాల్సిన అంశాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, వైద్యఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు వర్చువల్ పద్ధతిలో పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ అధికారులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో గంజాయి, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాలు పూర్తిగా రూపుమాపేందుకు వివిధ వర్గాలకు అవగాహన కల్పించాలని సూచించారు.

మతోన్మాద శక్తుల ప్రయత్నాలను తిప్పికొడదాం

తిరుపతి కల్చరల్: మతోన్మాద శక్తులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని సీనియర్ ప్రాత్రికేయుడు డీ.సోమసుందర్ పిలుపు నిచ్చారు. సీపీఐ తిరుపతి జిల్లా స్థాయి కార్యకర్తల శిక్షణ తరగతుల్లో మంగళవారం భారీయ చరిత్ర, సంస్కృతి అనే అంశంపై ఆయన ప్రసంగించారు.

సీఎంకు సాదర స్వాగతం, వీడ్కోలు



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి రోజా, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎంఎస్ బాబు, ఎమ్మెల్సీ భరత్, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి



సీఎంను సత్కరిస్తున్న ఎంసీ విజయానందరెడ్డి, పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఉదయం 10.35 గంటలకు ఆయన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీదిరి అప్పలరాజుతో కలిసి హెలీకాప్టర్‌లో మెసానికల్ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిషాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ద్వారకానాథరెడ్డి, మేయర్ అముద, ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, ఆర్డీఓ రేణుక పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమూల్ డెయిరీకి భూమి పూజ చేశారు. అనంతరం హెలీకాప్టర్ ద్వారా చీలాపల్లెలోని సీఎంసీ ప్రాంగణానికి చేరుకుని వైద్య కళాశాల, 300 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి హెలీకాప్టర్ ద్వారా రేణిగుంట ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్లారు.

సాదర వీడ్కోలు

చిత్తూరు జిల్లా పర్యటన అనంతరం మధ్యాహ్నం 3.55 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, పార్టీ నాయకులు సాదర వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన గన్నవరం విమానాశ్రయానికి బయల్దేరి వెళ్లారు. సీఎం వెంట మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీదిరి అప్పలరాజు, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలసిల రఘురాం ఉన్నారు.

ఇన్‌స్పిరేషన్ స్టార్ జగనన్న!

- ఇరిటేషన్ స్టార్ పవన్‌కల్యాణ్
- ఇమిటేషన్ స్టార్ చంద్రబాబు
- అల్లూరి జయంతి కానుక చిత్తూరు డెయిరీ
- చంద్రబాబు సిగ్గుతో తల దించుకోవాలి
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: ఇరిటేషన్ స్టార్ పవన్‌కల్యాణ్, ఇమిటేషన్ స్టార్ చంద్రబాబు కలిసి వచ్చినా ఇన్‌స్పిరేషన్ స్టార్.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాలి చిటికెన వేలును కూడా కదిలించలేరని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సరీ్వసులు, క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా స్పష్టంచేశారు. మంగళవారం పుత్తూరు పట్టణంలో 'అల్లూరి' జయంతిని పురస్కరించుకుని సీతారామరాజు విగ్రహానికి ఆమె పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కానుకగా చిత్తూరు జిల్లా పాడి రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు డెయిరీని అమూల్ పేరిట పునరుద్ధరించారని తెలిపారు. చిత్తూరు జిల్లా వాసిగా ఉండి ఇక్కడి ప్రజల ఆశీస్సులతో మూడుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబునాయుడు తన హెరిటేజ్ సంస్థ కోసం చిత్తూరు డెయిరీని మూసివేసిన దుర్మార్గుడని దుయ్యబట్టారు. సీఎం జగనన్న పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి చిత్తూరు డెయిరీపై ఉన్న రూ.182 కోట్ల బకాయిలను తీర్చివేసి, అమూల్ సంస్థ ద్వారా రూ.385 కోట్ల పెట్టుబడులతో చిత్తూరు డెయిరీని పాడి రైతులకు అందించడం జరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలని, జగనన్న సురక్ష పథకం ద్వారా జల్లెడ పట్టడం జరుగుతోందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి ఎమ్మెల్యే, మంత్రి ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తీర్చడం జరిగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటిని అందించడం ద్వారా రాష్ట్ర ప్రజల గుండెల్లో జగనన్న సుస్థిర స్థానాన్ని సంపాదించుకోగలిగారని చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రజలు హాయ్ ఏపీ!...బాయ్ బాయ్ బీపీ (బాబు,పవన్) వన్స్ అగైన్ వైఎస్సార్ సీపీ అంటున్నారని వెల్లడించారు. రాష్ట్ర ప్రజలు జగనన్నను మళ్లీ సీఎం చేయడానికి కసిగా ఉన్నారని తెలిపారు. రికార్డులు సృష్టించాలన్నా వాటిని తిరగరాయాలన్నా జగనన్నకే సాధ్యమన్నారు.

మరణంలోనూ వీడని బంధం

- రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి



మృతి చెందిన బాబు(ఫైల్)



హేమలత(ఫైల్)




అపస్మారక స్థితిలో పడి ఉన్న దంపతులు

వెదురుకుప్పం: రోడ్డు ప్రమాదంలో దంపతులు మృత్యువాత పడిన సంఘటన మంగళవారం మండలంలోని కసవనూరు వద్ద చోటుచేసుకుంది. ఇన్నాళ్లు ఒకరికొకరు తోడు నీడగా ఉన్నవారు మృత్యువులోనూ వారి బంధాన్ని వీడలేదు. తుది శ్వాసలోనూ ఒక్కటయ్యారు. మలుపులో వేగాన్ని నియంత్రించలేక కానరాని లోకాలకు చేరుకున్నారు. స్థానికుల కథనం ...మండలంలోని బలిజ మొండివెంగనపల్లెకు చెందిన పి.బాబు(54) తన భార్య పి.హేమలత(48)తో కొన్నేళ్ల క్రితం తిరుపతిలోని జీవకోనలో స్థిరపడ్డారు. వీరికి దినేష్, మోహన్‌కృష్ణ సంతానం. బాబు(54) టీటీడీ ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం బాబు తన భార్యను తీసుకుని ద్విచక్ర వాహనంలో కార్వేటినగరానికి వెళ్లారు. అక్కడ సబ్ రిజిస్టార్ కార్యాలయంలో పనిముగించుకుని వెదురుకుప్పానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో కసవనూరు సమీపంలోని మలుపు వద్ద ప్రమాదానికి గురయ్యారు. పచ్చికాపల్లం నుంచి ఎదురుగా వస్తున్న తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో దంపతులు ఇద్దరూ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని ప్రైవేటు వాహనంలో పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ బాబు మృతి చెందగా హేమలతను తిరుపతి రుయాకు తరలిస్తుండగా మార్గమధ్యంలో తుదిశ్వాస విడిచింది. విషయం తెలుసుకున్న వెదురుకుప్పం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతులకు రుయాలో శవపరీక్ష నిర్వహించారు. బస్ డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నారు. వెదురుకుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దంపతుల మృతితో బలిజ మొండివెంగనపల్లె శోకసంద్రంలో మునిగింది.

బ్రేక్ దర్శనం పేరిట మోసం

తిరుమల: నకిలీ రూ.300 ఎస్‌ఈడీ టికెట్లను ఓ భక్తుడికి అంటగట్టి మోసగించిన దళారుల ముఠాపై తిరుమల టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ బాబు కథనం.. తెలంగాణ రాష్ట్రం, హైదరాబా ద్‌కు చెందిన కామిశెట్టి వేణు శ్రీవారి దర్శనార్థం దళారి అభిషేక్‌ను ఆశ్రయించాడు. అతను నాలుగు బ్రేక్ దర్శనం టికెట్లు ఇప్పిస్తానని చెప్పి రూ.11 వేలను భక్తుడి నుంచి తీసుకుని శ్రీను అనే మరో దళారి నంబరు ఇచ్చి సంప్రదించాలని సూచించాడు. దీంతో భక్తుడు శ్రీనును సంప్రదించగా అతను ఎం.అశోక్‌నాయక్ అనే మరో దళారి నంబరు ఇచ్చి సంప్రదించాలని తెలిపారు. భక్తులు ఎం.అశోక్‌నాయక్ వద్దకు వెళ్లగా అతను భక్తుడి పేరుతో నాలుగు రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లను ఇచ్చి.. ఏటీసీ కూడలి నుంచి వైకుంఠం క్యూకాంప్లెక్స్ మీదుగా వెళితే అక్కడ టికెట్ స్కానింగ్ చేసే శివనారాయణ ఉంటాడని, అన్నీ అతను చూసుకుంటాడని తెలిపారు.

సంప్రదాయాలు పాటిస్తే లక్ష్మీకటాక్షం



ఉపన్యసిస్తున్న ఆచార్య ప్రవా రామకృష్ణ

తిరుపతి కల్చరల్: సనాతన హిందూ ధర్మంలో ఉన్న సంప్రదాయాలను పాటిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుందని ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆచార్యులు ప్రవా రామకృష్ణ సోమయాజి తెలిపారు. లోకకల్యాణార్థం టీటీడీ పరిపాలనా భవనం ప్రాంగణంలోని మైదానంలో చేపడుతున్న శ్రీనివాస చతుర్వేద హవనం మంగళవారం ఆరో రోజుకు చేరింది. రాత్రి 7 గంటలకు ఆచార్య ప్రవా రామకృష్ణ సోమయాజి రుగ్వేదం -లక్ష్మీ కటాక్షం అనే అంశంపై ఉపన్యసించారు. టీటీడీ జేఈఓ సదాభార్గవి, హిందూ ధర్మప్రచార పరిషత్ ఇన్‌చార్జ్ ప్రోగ్రాం అధికారి ప్రశాంతి, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ పాల్గొన్నారు. అనంతరం రాత్రి సాంస్కృతిక వేదికపై ప్రదర్శించిన భక్తి సంగీత, నృత్య కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన ముఖేష్ కుమార్ సింగ్

వరదయ్యపాళెం: ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని చిన్న పాండూరు సమీపంలో చోటుచేసుకుంది. శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి తెలిపిన మేరకు.. చత్తీస్‌ఘడ్‌కు చెందిన ముఖేష్ కుమార్ సింగ్ చిన్న పాండూరు సమీపంలోని వీకేఆర్ వైకాలనీ వద్ద చికెన్ దుకాణంలో రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం చిన్న పాండూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం వచ్చి తిరిగి వీకేఆర్‌వై కాలనీ కూడలి చికెన్ దుకాణం వద్దకు మోటారు సైకిల్‌పై వెళ్తున్నాడు. వరదయ్యపాళెం వైపు లారీ వస్తున్న లారీ నక్కలమిట్ట వద్ద ముఖేష్‌కుమార్‌సింగ్ ద్విచక్ర వానాన్ని ఢీకొట్టింది. ముఖేష్‌కుమార్‌సింగ్ లారీ వెనుక చక్రాల కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మద్యం మత్తులో ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి శవపంచనామా నిమిత్తం మృత దేహాన్ని సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

రిమాండ్ ఖైదీ మృతి

తిరుపతి క్రైం: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఓ రిమాండ్ ఖైదీ మంగళవారం మృతిచెందాడు. తిరుపతి సబ్ జైల్ సూపరింటెండెంట్ గురుశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు... తమిళనాడు వేలూరు సమీపంలోని అంబూరు ప్రాంతానికి చెందిన సెల్వం చెల్లదొరై (36) తిరుపతిలో యాచకుడిగా ఉంటున్నాడు. 8 నెలల క్రితం కొంతమంది యాచకుల మధ్య జరిగిన దాడి కేసులో చల్లాదొరైని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపించారు. ఇదిలా ఉండగా శనివారం ఆయన ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఎదర్కోవడంతో జైలు అధికారులు అతనిని రుయా ఆసుపత్రికి తరలించారు. ఊపిరితిత్తుల సమస్యతోపాటు గుండెకు సంబంధించిన సమస్యలు కూడా అతనికి ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. అప్పటి నుంచి రుయాలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు.

సీఐ ఆనందరావుకు అధికార లాంఛనాలతో వీడ్కోలు



ఆనందరావుకు నివాళులర్పిస్తున్న, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



ఆనందరావుకు అధికార లాంఛనాలతో నివాళులు అర్పిస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్

- నివాళులర్పించిన ఎంపీ గోరంట్ల మాధవ్, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): అనంతపురం జిల్లా, తాడిపత్రి సీఐ ఆనందరావు ఆత్మహత్య చేసుకొని మృతి చెందడంతో ఆయన స్వగ్రామం చంద్రగిరి మండలం, కల్‌రోడ్డుపల్లిలో విషాదం నెలకొంది. తాడిపత్రి నుంచి సోమవారం సాయంత్రం స్వగ్రామానికి చేరిన ఆయన పార్థీవదేహానికి మంగళవారం అంతిమయాత్ర నిర్వహించారు. ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఆయనకు తుది వీడ్కోలు పలికారు. చంద్రగిరి సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు మూడు రౌండ్ల పాటు గాలిలోకి కాల్పులు జరిపి నివాళులర్పించారు. బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు ఆనందరావుకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఎంపీ గోరంట్ల మాధవ్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు హర్షిత్ రెడ్డి కల్‌రోడ్డుపల్లికి చేరుకొని ఆనందరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనందరావుతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. సీఐ ఆనందరావు మరణం బాధాకరమని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్నివిధాల ఆదుకుంటామని, అండగా ఉంటామని భరోసా కల్పించారు.